బృందావనం

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

రాధ తనదుఃఖం ఇంక భరించుకోలేకపోయింది.

ఆ చెట్టునీడని కూర్చుని మ్రానుమీద శరీరంవాల్చి చంటిపిల్లలా ఏడవడం ప్రారంభించింది. రెండు గంటల క్రిందట రావలసినవాడు ఇంకా రాలేదు. తప్పకుండా వస్తానని మాటకూడా ఇచ్చాడు. తనంటే ఇంతనిర్లక్ష్యంగా ఉన్నాడన్నమాట. ఈ రాదలచుకోనివాడి కోసం తను సిగ్గులేక అరగంటా, గంటా, రెండుగంటలూ కూడా ఇలా ఆశపెట్టుకుని కాచుకునేఉంది. తనమీద అతనికిలేని ఇంతఅనురాగం అతనిమీద తనకి ఎందుకుండాలో తనకి బోధపడలేదు. కొంత పౌరుషంకూడా కలిగింది. ఇకమీదట అతనితో మాట్లాడనైనా మాట్లాడకూడదని నిశ్చయించుకుంది. తనజీవితంతో అతనికింక సంబంధం లేదనుకుంది. తనదారి తనది.

ప్రత్యేకంగా ఈవాళ కొన్నివిషయాలగురించి మాట్లాడాలనికూడా ముందటిరోజున హడావిడిగా కలుసుకున్నప్పుడు అతనికి తను బోధపరచింది. "సరే" అన్నాడు. "ఆవిషయాలేమిటో నాకప్పుడే తెలుసును" అనికూడా చెప్పేడు, నవ్వుతూ ...... తెలుసుకున్నాడేమోకూడా! తెలుసుకుంటే ఆ నవ్వేమిటి?

అదికాక, రోజులుగడుస్తున్నకొలందీ అతను శాంభవివలలో మరీసులభంగా పడిపోతున్నట్టుకూడా కనిపిస్తోంది. వారంరోజులక్రిందట సాయంత్రం సఖం చీకట్లు క్రమ్మేక చెఱువుగట్టుమీద అతను శాంభవితో మాట్లాడుతూ పచార్లుచెయ్యడం తను కళ్లారాచూసింది. తర్వాత అతన్ని కలుసుకున్నప్పుడల్లా ఎన్నోసార్లు ఆసాయంత్రం వాళ్లిద్దరూ తనకంటబడ్డట్టు చెప్పాలని నాలుకచిగురుదాకా వచ్చేది కాని, వళ్లీచెప్పడానికి మనసొప్పేదికాదు. చెప్తే అతనిమీద తను కాపలా కాస్తున్నట్టు భావిస్తాడేమోనని భయంకలిగింది. తను చెప్పినాకూడా, తీరాశాంభవిని ఆనాడు కలుసుకోనేలేదని అతను అబద్ధం ఆడితే, ముఖ్యంగా అతనికి కాకుండా తనకే ఎక్కువ చిన్నతనంగా ఉంటుందని రాధకి తెలుసును. ఎప్పుడైనా శాంభవినిగురించి అతనంతట అతనే మాట్లాడుతాడేమోనని ఎదురుచూస్తే, లోకంలోఉన్న ప్రతివాళ్లగురించీ మాట్లాడుతాడు కాని శాంభవిపేరెత్తడు. అతనిచర్యలకి వేరే రుజువెందుకు?

ఈరోజునకూడా చెప్పినవేళకి అతను రాకుండా ఉండడానికి కారణం అతను శాంభవితో కూర్చుని ఆనందంగా కాలంగడుపుతూ ఉండడమేనని రాధ నిశ్చయించుకుంది. శాంభవిని తలచుకున్నప్పుడల్లా రాధకి ఈ జీవితం భరింపరానిదనిపించింది. దానికితోడు శాంభవిమాట తను ఏక్షణంకూడా మరచిపోవడం అంటూ లేదు. ఎలామరచిపోవడం, తనప్రాణంతో సమానమైనవాడిని శాంభవి అపహరింపదలచుకున్నప్పుడు?

ఇంతట్లోనే తనుకూర్చున్న ప్రదేశానికి కొంచెం దూరంలో శాంభవి కనిపించింది. అవును, శాంభవే. ఒంటరిగా వస్తోంది. ఇటూఅటూ ఎంతచూసినా అతను మట్టుకు కనుమేరచూపులో ఎక్కడా లేడు. అయితే ఇంతసేపూ శాంభవితో లేనేలేడేమో అతను! తన అన్యాయపు అనుమానాలేనా ఇవన్నీ? శాంభవితో లేనట్టయితే అనుకున్నవేళకి రాకపోవడం ఎందుకల్ల? తీరా, శాంభవితో ఒక్కత్తెతోనేకాకుండా మిగిలినవాళ్లతోకూడా ఎక్కువగా స్నేహం చేస్తున్నాడేమో! తను కనిపెట్టడంమట్టుకే శాంభవి నొక్కత్తెనీ కనిపెట్టడం అయిందేమో? అతను హాస్యపుకబుర్లు చెప్తూ నిర్లక్ష్యంగా నవ్వుతున్నప్పుడు చూసి ఎటువంటివాళ్లైనా లోబడిపోతారు. ఎవరితోఉన్నా అలాగే నవ్వుతాడతను. ఆ నవ్వులన్నీ తనకిమట్టుకే అందివ్వకుండా లోకానికంతకీ సమర్పిస్తాడని రాధకి కోపం ......

మిగిలినవాళ్లెవరున్నారసలు? మల్లిక, సౌదామిని, మందాకిని, — అబ్బే, వీళ్లని సమంగా చూడనైనా చూడలేదతను,తనకి తెలిసినంతవరకు. తనకి తెలిసినంత వరకు!

శాంభవి రాధకూర్చున్నస్థలానికే వచ్చింది. కాసేపు రాధకేసి పరీక్షగా చూస్తూనుంచుంది. రాధ కూడా మాట్లాడకుండా ఉండేసరికి శాంభవే ముందు మాట్లాడింది.

"ఈ మారుమూలకి వచ్చికూర్చున్నా వెందుకు రాధా?"

"ఇక్కడ కూర్చునేందుకు నాకు హక్కు లేదా?"

"నీకు హక్కు లేదనికాదు. ఒంటరిగావచ్చి కూర్చున్నావుకదాఅని అడిగేను."

"నా ఇష్టం నాదీ. నాకు ఒంటరిగా ఉండడం ఇష్టంకనుక వచ్చి ఇలాకూర్చున్నాను. నువ్వుమట్టుకు ఈ మారుమూలకి ఒంటరిగా ఎందుకురావాలి?"

"నాతో వచ్చేవాళ్లు మరెవరూ లేరుకనుక."

"నాతో వచ్చేవాళ్లుమట్టు కెవరున్నారు?"

"లేకేమి? పల్లెలో నీకందరూ స్నేహితులే. అందరూ నువ్వంటే అభిమానం ఉన్నవాళ్లే — చిన్న వాళ్లూ, పెద్దవాళ్లూ, ఆడవాళ్లూ, మొగవాళ్లూ కూడాను."

"అలాగా? మొగవాళ్లకికూడా నేనంటే అభి మానమేనని ఎవరుచెప్పేరు నీకు?"

"ఒకరు చెప్పాలా? అదికాక, వినయుడు చాటు తున్నాడుకా — ఈ పల్లెలో నిన్నుమించినపిల్ల లేదనీ, ...నిన్నతను పెళ్లిచేసుకునేటట్టు స్థిరపడిందనీ."

వినయుడు ఈ విధంగా అందరితోనూ చెప్తున్నా డన్నవిషయం తనకి తెలిసినదైనప్పటికీ, ఆ మాటే శాంభవి చెప్పగానే రాధ ఒక్కక్షణం తనగుండె కొట్టు కోడం మానేసినట్టుగా కంగారుపడింది. మారు మాట్లాడ లేకపోయింది. ఎంతవెదికినా మాట్లాడేందు కేమీ తనకి మరొకవిషయం కనబడలేదు తెల్లబోయి శాంభవి ఏమిటేమిటో చెప్తుంటే వింటూ, శాంభవికేసిచూస్తూ కూర్చుంది.

ఇంతట్లో శాంభవిమాటలలో రాధకి వినయుడి పేరుమాత్రమే కాకుండా......ఆతనిపేరుకూడా విన బడినట్టు తోచింది. అవును. అతనిమాటే. శాంభవి సంభాషణలోకి ఆతనిపేరు ఏవిధంగా తీసుకువచ్చిందో, అతనిగురించి మొదట ఏమిటిమాట్లాడిందో రాధ సరిగ్గా విననైనాలేదు. కాని శాంభవి ఇప్పుడు మాట్లాడుతున్నది అతనిగురించే.

"అతన్ని మళ్లీ ఇప్పుడే చూసేను, రాధా. పల్లెకి దక్షిణాన్నిఉన్న పెద్దమర్రిచెట్టుక్రింద వినయుడితో అతిగూఢంగా మాట్లాడుతున్నాడు. మొదట నాకేసైనా చూడలేదు ఇద్దరూకూడా. తర్వాత నేను పలకరించినా అతను పలకలేదు. వినయుడే నవ్వుతూ రెండుగంటల బట్టి ఇద్దరూ అక్కడేనుంచుని ఏమిటేమిటో మాట్లాడు కుంటున్నట్టు చెప్పేడు."

ప్రత్యేకంగా ఈరోజున వినయుడితో అతను రెండుగంటలు మాట్లాడుతున్నాడా? ఏ విషయమై మాట్లాడుతున్నాడో? ఒకవేళ తనవిషయమేనేమో!

"అలాకొంతదూరం నడుద్దాం వస్తావా రాధా?"

"వద్దు. నాకు నడవాలని లేదు. అదికాక, కాసే పట్లో ఇంటికిపోవాలి."

"రావూ? సరే, నేను వెళ్తాను. ...... అయితే నిజంగా వినయుడిని నువ్వు పెళ్లిచేసుకుంటున్నట్టేనా రాధా?"

"నాకావిషయమై ఏమీతెలియదు శాంభవీ."

"నీకు చెప్పాలని లేకపోతే చెప్పకు."

"అదికాదు ...... నిజంచెప్తే ఎవరితోనూ చెప్పవుకదా?"

"ఎందుకుచెప్తాను?"

"వినయుడికి నేనంటే ఇష్టంఅని మా అమ్మ గ్రహించి, నాతోచెప్పకుండా రెండువారాలక్రిందట

వినయుడిని పిలిపించి నన్ను పెళ్ళిచేసుకోమని అడిగిందట. వినయుడు సంతోషిస్తూ 'సరే' అన్నాడట. నిన్న ప్రొద్దున్న వినయుడూ, వినయుడి తల్లిదండ్రులూ వచ్చి నా ఎదురుగుండా మా అమ్మతో ముహూర్తం స్థిరపరచుకోడం విషయమై మాట్లాడడం మొదలు పెట్టేరు. నిన్నటినుంచి నాకేమీ తోచడంలేదు."

తన రహస్యం చెప్పేసేక 'ఇదంతా శాంభవికి చెప్పేసేనే!' అని రాధ విచారించడం మొదలుపెట్టింది.

"వినయుడిని పెళ్ళి చేసుకోవాలని లేదా నీకు?"

"అసలు పెళ్ళేచేసుకోవాలని లేదు నాకు.... నేను చెప్పినదంతా నువ్వెవరికీ తెలియపరచకూడదు."

"ఎవరికీ చెప్పనులే. వినయుడు నీకు పనికిరాలేదన్నమాట?"

"పనికిరాలేదని కాదు."

"వినయుడు దొరికితేచాలునన్నవాళ్ళనేకమందున్నారు ఈ పల్లెలో."

రాధకి కోపం వచ్చింది.

"నేను లేరనలేదు. వినయుడి లోటుపాట్లు చూసి నేను సందేహిస్తున్నానని కాదు. నాకు పెళ్ళంటేనే అయిష్టం."

"నేను పోతాను."

"ఎవరితోనూ చెప్పకు."

"చెప్పను."

శాంభవి వెళ్ళిపోయింది. రాధ దీర్ఘాలోచనలో పడింది. 'అనవసరంగా అతనిమీద అపనమ్మకాలు పెట్టుకున్నా'నని దుఃఖపడింది. వినయుడితో అతనేమి మాట్లాడేడో తెలుసుకోవాలని చాలా కుతూహలపడింది.......ఇంత ఆలస్యంచెయ్యడం వినయుడితో మాట్లాడుతూ ఉండడంవల్లనే. చెప్పినవేళకి తనదగ్గరకి రాకుండా వినయుడితో మాట్లాడుతూ ఉండిపోయాడంటే ఏదో చాలాముఖ్యమైన విషయమై మాట్లాడుతూ ఉంటుండాలి. అంత ముఖ్యమైన విషయం తనదికాక మరొకటేమిటుంది?

మరొక పది పదిహేను నిముషాలలో అతనే వచ్చాడు.

సుఖంగానవ్వుతూ తను లేచినుంచుంది. తను అందిచ్చిన రెండుచేతులూ రెండుచేతులతోనూ పట్టుకున్నాడు. తర్వాత కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నాడు.

"ఇంత ఆలస్యం చేసినందుకు నన్ను పడతిట్టావని భయపడుతూ వచ్చాను రాధా, ఇక్కడకి."

"నీమీద ఎప్పుడూ నేను కోపంగా ఉంటున్నట్టు!"

"నామీద నీ కెన్నడూ కోపంరాలేదంటావా?"

"అవును. ఎప్పుడూ నువ్వంటే నాకు కోపమే"

"చూసేవా? నువ్వే ఒప్పుకుంటున్నావు.... అవునుకాని, ఈవాళ నీకెందుకు కోపంరాలేదు?"

"ఈవాళ నేను కోపంగాలేనని నీ కెలా తెలుసును?"

"కూర్చుందాం రా. .... నిజంచెప్పు. ఆలస్యం ఎందుకయిందనైనా అడగలేదు నువ్వు."

"ఇంతసేపూ నువ్వెక్కడున్నావో నాకు తెలుసును."

"కొంపముంచేసేవు! నామీద ఎవరినైనా కాపలాపెట్టేవా?"

"రెండుగంటలబట్టి ఆ పెద్దమర్రిచెట్టుక్రింద నుంచుని వినయుడితో ఏమిటేమిటో మాట్లాడుతున్నావు."

"ఛా, ఛా. నేనక్కడ లేనే లేను. వినయుడిని నేనిప్పుడు కలుసుకోలేదే!"

"నిజంగా నువ్వక్కడ లేవూ? ఎక్కడున్నావు నువ్వింతసేపూ మరి? అక్కడలేకపోతే ఇంత ఆలస్యం ఎందుకుచేసేవు?"

"నువ్విక్కడకి రమ్మన్నావన్నమాటే మరచిపోయాను రాధా. ఇప్పుడిప్పుడే జ్ఞాపకం వచ్చింది."

"అవును, మరచిపోవుమరీ, నీ వ్యాపకాలన్నిటి తోనూ?"

"అదుగో, ఏడుపు ప్రారంభించకు."

"ఎందుకు ఏడవడం?......నిజంగా నువ్వు వినయుడితో మాట్లాడడం లేదూ?... వేళాకోళానికి మరచిపోయానని అబద్ధం ఆడుతున్నావు. అవునా?... ఇప్పుడుమట్టుకు వేళాకోళం చెయ్యకు. ఇంతసేపూ వినయుడితో మాట్లాడడం లేదూ నువ్వు?"

"లేదు రాధా. అబద్ధం చెప్పను."

"మరి, ఆ మాయదారిపిల్ల నాతో అలా అబద్ధం ఎందుకుచెప్పింది?"

"ఎవరా మాయదారిపిల్ల?"

"శాంభవి. నీ ముఖ్య స్నేహితురాలు"

"ఏమని చెప్పింది?"

"తనిప్పుడిలావస్తుంటే తోవలో నువ్వూ, వినయుడూ మాట్లాడుకుంటున్నారనీ, రెండుగంటలబట్టి అలా మాట్లాడుకుంటూ ఉన్నామని తనతో మీరు చెప్పేరనీ చెప్పింది."

"ఓహో, శాంభవి నీతోవచ్చి చెప్పేసిందా? తను ఆతోవని వచ్చిందన్న మాటే నేను మరచి పోయాను. ఇంకా దాచి మరికొంతసేపు నిన్ను బాధపెట్టి తర్వాత చెప్పేదాం అనుకున్నాను. .. ... శాంభవీ, నువ్వూ గొప్పస్నేహితులన్నమాటఆలోచించుకోలేదు."

"నాకేమీ స్నేహితురాలుకాదు శాంభవి... నిజంగా నువ్వు ఇంతసేపూ వినయుడితో మాట్లాడుతున్నావా?"

"అవును రాధా."

"నిజంగా?"

"నిజంగా."

"నిన్ను నమ్మేందుకులేను. ఇందాకా నిజం చెప్పేవో, ఇప్పుడు నిజంచెప్తున్నావో నాకెలా తెలుస్తుంది?"

"ఇప్పుడు చెప్తున్నమాటే నిజం."

"నిజంగా?"

"అవును."

"ఎలానమ్మడం?"

"పోనీ, నమ్మకు. నమ్మక, దుఃఖపడు."

"అవును, దుఃఖమేమరి ...... కాసేపయాక ఇప్పుడుచెప్పినమాట అబద్ధం అంటావు. ఇందాకానే చెప్పకూడదూ నిజమైనమాట?"

"సరదాకి నిన్నుకొంచెం బాధపెట్టి తర్వాత నిజంచెప్పాలనుకున్నాను."

"నేనుబాధపడుతుంటే నీకు సరదా కాదూ?"

"అవును నువ్వు కొంచెంబాధపడుతుంటే నాకు కొంచెం సంతోషం. నువ్వు చాలాబాధపడుతుంటే నాకు చాలాదుఃఖం."

"రెండవమాట నమ్మను."

"అబద్ధంకాదు. ......కాని, రాధా, ఎప్పుడూ నువ్వు మనప్రేమనుగురించే ఆలోచిస్తూ, ఇరవై నాలుగు గంటలూకూడా అదే మనస్సులోపెట్టుకుంటే నీ జీవితం సంపూర్ణసాఫల్యం లేనిదవుతుంది."

"ఎందువల్ల?"

"ఎందుకేమిటి? నీ వ్యక్తిత్వం నశిస్తుంది. నువ్వు మరొకరిలో లీనమైపోతుంటే, వేరుగా ఒక వ్యక్తివై పుట్టిన లాభం ఏమిటి?"

"నాకు వ్యక్తిత్వంతో పనిలేదు. నేను స్త్రీని. పురుషుడిలాగ ఒకసారి నిర్లక్ష్యంగా ప్రేమించి ఆప్రేమ మరచిపోయి నాదారిని నేను పోలేను."

"నిన్నిప్పుడు నేనుచెయ్యమంటున్నది అదికాదు. నీ జీవితం అంతా ఏ తెలివితక్కువ మొగపురుగుమీదనో ఈ నిముషం నీకున్నప్రేమపై ఆధారపడనివ్వొద్దని చెప్తున్నాను. నువ్వు మరొకరిలో లీనమైయుండ కూడదు. నీవ్యక్తిత్వం నువ్వు నిలబెట్టుకోవాలి."

"నాకు నీ వేదాంతం తలకెక్కడంలేదు. ... స్త్రీతత్వానికీ, పురుషతత్వానికీ చాలాభేదం ఉంది."

"ఆ తత్వభేదం సామాన్యస్త్రీలకీ, సామాన్య పురుషులకీ చెందుతుంది కాని......"

"నేను సామాన్యపు స్త్రీనే."

"నువ్వే సామాన్యపు స్త్రీవైతే, అందుకు గర్వపడకు. ఈసామాన్యపు స్త్రీలన్నా, సామాన్యపు పురుషులన్నా నాకు పరమఅసహ్యం. చిన్నపిల్లలైనా నయం. చిన్నపిల్లలకున్న జ్ఞానం పెద్దలకి చాలామందికిలేదు. ... ఒకమాట చెప్తాను. చిన్నపిల్లలు ఆడుకోడం ఎప్పుడైనా పరీక్షగా చూసేవా?"

"చూడకేమి? వాళ్లచేష్టలన్నీ నాకెంతో ఇష్టం. నీకూను. నువ్వంటే పల్లెలోపిల్లలందరికీ......"

"అవునులే. విను. వాళ్లఆటలు చూస్తుంటే రెండుసంగతులు ప్రత్యేకంగా తేటబడతాయి. మొదటిది, వాళ్లకి బొమ్మలన్నా బొమ్మలతో ఆటలన్నా సరదా ఎల్లకాలం ఉండకపోవడం. రెండవది, ..."

"నాకిదంతా ఎందుకిప్పుడు బోధపరచడం?"

"వినుమరి...రెండవది, వాళ్లు బొమ్మలతో ఆడుకుంటున్నప్పుడుకూడా వాళ్లబొమ్మలు నిజమైన జీవులు కావనీ, వాళ్లఆటలు నిజంగా జీవితం అనే పదార్థం కావనీ చిన్నపిల్లలుకూడా గ్రహించినట్టు మనకి నిర్ధారణ ఉండడం."

"ఏమిటి ఆనిర్ధారణ?"

"ఏమిటా? ... అనేకసూచనలు కనిపిస్తాయి. ...చిన్న చిన్న పిడతలలో మన్నుపోసి ఆ మన్నే అన్నంఅన్నట్టు పిల్లలందరూ ఆడుకుంటారు. కాని అది నిజమైనఅన్నం కాదని వాళ్లకితెలుసును. ఎప్పుడూ నోటిదాకా తెచ్చుకుంటారు కాని నోట్లోవేసుకోరు. అప్పుడప్పుడు పిడతలో ఏమీలేకపోయినాకూడా అందులో అన్నం ఉన్నట్టు నటిస్తారు. ఆ అన్నం తింటున్నట్టు నటిస్తారు. నిజంగా అన్నం లేదన్నమాట వాళ్లకికూడా తెలుసును. ఒప్పుకుంటావా?"

"అయితే?"

"అయితేనా? చిన్నపిల్లలు వాళ్లబొమ్మలూ, వాళ్లఆటలూ ఎంతోశాశ్వతం అయినట్టూ, ఎంతో ముఖ్యం అయినట్టూ దీక్షగా ఆడుకుంటున్నప్పటికీ కూడా ఈ ఆటలూ ఈ బొమ్మలూ శాశ్వతంకావనీ, నిజంకావనీ వాళ్ల మెదడులో ఏదో ఒకభాగం ఏవిధంగా గ్రహించే ఉంటుందో, ఆవిధంగానే......"

"ఆవిధంగానే?"

"ఆవిధంగానే పెద్దవాళ్లమైనమనం ఒకమూల మన మానవధర్మాలన్నీ దీక్షగా అవలంబిస్తూకూడా మన పెద్దబొమ్మరిళ్లలోనైనా ఇంకా ఆటలే ఆడుకుంటున్నామనీ, మన సామాన్యపు జీవితాలలోనైనా నిజంగా ఆత్మసంతృప్తినిచ్చే పదార్థం లేదనీ గ్రహించాలి. అలా గ్రహించికూడా మామూలుగా జీవించగలిగేశక్తిని పొంది ఉండాలి."

"నువ్వుమాట్లాడేదేమీ నాకు బోధపడడంలేదు. నన్నెందుకు బాధపెట్తావు?"

"నీకు బోధపడకపోవడం పూర్తిగా నీ తప్పు కాదు, నాదికూడాను. సరిగ్గా చెప్పలేకపోతున్నాను. నేను మాట్లాడుతున్న విషయమై నాకున్న ఊహలన్నీ ఇంకా మనస్సులో స్థిరమైన రూపం పొందలేదు. ఆరూపం వాటికిచ్చేందుకు తంటాలు పడుతున్నాను... నాలో నాకున్నంతనమ్మకం ఎవరికీ నాలో లేదు. అందువల్ల లోకానికంతకీ అసాధారణమైన వేదాంతజ్ఞానం ఏదోఅందిచ్చికాని నేను ప్రాణంవదలనని అప్పుడప్పుడు నాకు తోస్తూ ఉంటుంది. అటువంటి సమయాలలో దేవుడే నాలో అవతారం ఎత్తేడనికూడా అనుకుంటూ ఉంటాను. అంత ఉత్సాహం కలుగుతూ ఉంటుంది నాకు......నే నెంతవాగినా, నీకేమీ ఉత్సాహంలేదు కాదూ?"

"ఉత్సాహంమాట నాకుతెలియదు. కాని నువ్వు మాట్లాడుతున్నంతసేపూ నీ పెదవులూ, నీకళ్లూ, నీదివ్యమైనముఖం చూస్తుంటే నాకు అదోక ఆనందం. నువ్వు

ఏమిమాట్లాడుతున్నావోకూడా సరిగ్గా వినడంలేదు. నువ్వుఅన్నట్టు నువ్వు దేవుడివే అయినాకూడా నిన్ను నేనిప్పుడు ప్రేమిస్తున్నంతకంటె ఎక్కువ ప్రేమించలేను, నిన్ను నేనిప్పుడు పూజిస్తున్నంతకంటె ఎక్కువ పూజించలేను. నిజంగా."

"అలాఅనకు, రాధా. ...... నన్నంత పూజిస్తున్నానంటావుకదా, నేనొకసంగతి చెప్తాను — ఎంతవరకు భరించగలవో చూస్తాను."

"ఏమిటది?"

"నే నీ సాయంత్రం ఇంతసేపటివరకూ ఎక్కడున్నానో నిజంగా చెప్పనా?"

"వినయుడితో లేవూ?"

"లేను."

"ఎవరితో ఉన్నావుమరి?"

"శాంభవితో."

"అబద్ధం ఆడుతున్నావు నువ్వు నన్ను మళ్లీ బాధపెట్టాలని."

"లేదు. నిజంచెప్తున్నాను."

"నేను నమ్మను."

"పోనీ నమ్మకు."

"శాంభవివచ్చి నాతో నిన్నూ, వినయుడినీ అక్కడచూసేనని ఎందుకుచెప్పింది?"

"శాంభవిని నేనే ఇటుప్రక్కకివెళ్లమని పంపించాను, తనమీద నీకు అనుమానం ఉండకుండా చేసేందుకు."

"నీ పన్నాగమేనా తనురావడం? నీవలలో ఎంతసులభంగా పడ్డాను! ... ఇప్పుడైనా నిజంచెప్పు. ఇంతసేపూ శాంభవితో ఉన్నావా?"

"అవును రాధా."

"నిన్నూ, వినయుడినీ అక్కడచూసినట్టు శాంభవిని నాతో చెప్పమన్నదికూడా నువ్వేనా?"

"కాదు. అది తనస్వంతకల్పన."

"ఇ మీదట నీతో అసలు మాట్లాడను నేను. ఇలా నన్ను చిన్నవిషయాలలోనూ, పెద్దవిషయాలలోనూకూడా మోసగించి అవమానపరుస్తుంటే చూస్తూ ఊరుకోనా?"

"చిన్నవిషయాలలోనూ, పెద్దవిషయాలలోనూ కూడానా?"

"కాదుమరి ... అంతసేపు శాంభవితో నువ్వెందుకుండాలి? అసలు శాంభవిదగ్గరకి నువ్వెందుకు వెళ్లాలి? ... శాంభవికీ నీకూ ఈస్నేహం ఎన్నాళ్లబట్టి"

"ఏమీ? చాలాకాలంబట్టే ఉంది."

"ఎలాకుదిరింది మీ ఇద్దరికీ ఈస్నేహం?"

"ఒకరోజున ఈప్రాంతాలలోనే ఇద్దరం తిరుగుతుంటే దృష్టితిప్పకుండా తనకేసి నేనుచూసేను. దృష్టితిప్పకుండా నాకేసి తనుచూసింది. తనునవ్వింది. నేను నవ్వేను. ఆ తర్వాత నేనే పలకరించాను."

"సిగ్గులేదూ పిల్లకి!"

"మనిద్దరికీ పరిచయం ప్రారంభించడం జ్ఞాపకం ఉందా?"

"ఆమాట జ్ఞాపకంచేసి నన్నిప్పుడు దెప్పిపొడవనక్కరలేదు. నా సంగతివేరు. ...... నీవిషయంలో ఆపిల్లా నేనూ ఒకటేనా?"

"ఒకటేఅని కాదులే."

"ఇలానన్ను అవమానపరచడంన్యాయమేనా?"

"ఇందులో నీకు అవమానం ఏముంది?"

"నన్ను తోసిపెట్టి మిగిలినవాళ్లతో నువ్వు స్నేహంచేస్తుంటే అవమానం నాకుకాక మరెవరికి? వాళ్లు నన్నుచూసి నవ్వుకోరూ? లోకంఅంతా ఏమనుకుంటారు?"

"వాళ్లు ఏమనుకుంటే ఏమిటి రాధా?"

"వారంరోజులక్రిందట శాంభవీ, నువ్వూ కలసి చెఱువుగట్టుమీద పచార్లుచేస్తుంటే చూసేను."

"వచ్చి నువ్వుకూడా మాతో పచార్లు చెయ్యలేకపోయావా?"

"ఆలోచించి అంటున్నమాటలే అవి ?"

"ఈ మాత్రానికే ఆలోచించాలా ?"

"ఆరాత్రంతా నేను నిద్రపోలేదు."

"ఈమధ్య ప్రతిసాయింత్రమూ చీకటిపడ్డాక శాంభవీ నేనూ అక్కడ కలుసుకుంటూనే ఉన్నాము."

"ప్రతిసాయింత్రమూనా ?"

"అవును."

"ఎంతచులాగ్గా సమాధానాలు చెప్తున్నావు... నేనంటే నీకంత వేళాకోళంగా ఉందన్నమాట."

"ఏమిా ?"

"ప్రతిరాత్రీ ఆదుర్మార్గురాలితో కాలం గడుపుతూకూడా, ఇప్పుడు నాదగ్గరకూర్చుని ఇంత సావకాశంగా ఎలా మాట్లాడగలుగుతున్నావు ?"

"శాంభవి అంత దుర్మార్గురాలని తోచదు నాకు."

"శాంభవికాదు. నువ్వే దుర్మార్గుడివి. ... నీతో నేనింక మాట్లాడను, ఎన్నడూ నీతోరాను, ముట్టుకో నివ్వను."

"నన్ను నిజంగా నువ్వు ప్రేమిస్తున్నావనే నీఉద్దేశ్యం రాధా ?"

"ఇన్నాళ్లూ ప్రేమించాను. ఈ నిముషం ఆప్రేమఅంతా నశించింది."

"నిజమైనప్రేమకి నశింపుఅంటూ ఎన్నడైనా ఉంటుందా ?"

"నువ్వే నశించేటట్టు చేసేవు."

"నేనా ?"

"అవును."

"శాంభవితో స్నేహం చెయ్యడంవల్లనా?"

"ఈ ప్రశ్నలన్నీ నన్నెందుకు అడగడం ?"

"నీకు తెలియదేమో కాని, శాంభవితో నాకున్న పాటిచనువు మిగిలినవాళ్లల్లో చాలామందితో ఉంది నాకు."

"నీరహస్యాలన్నీ తెలుసుకుందామన్నకోరిక నాకులేదు. తెలుసుకున్నది చాలును...... ఆ మిగిలిన వాళ్ల పేర్లేమిటి ?"

"మల్లిక, మందాకిని, ముక్త, మేఘావతి, ... మరికొందరి పేర్లుకూడా నాకు తెలియవు."

"నిజంగా వీళ్లందరితోనూ నువ్వు చాలా చనువుగా ఉన్నానంటావా ? నిజంగా నువ్వు శాంభవితో ఈసాయింత్రం అంతా గడిపేనంటావా ? అబద్ధం ఆడకు. వేళాకోళానికి ఈ అబద్ధాలన్నీ ఆడినన్ను బాధ పెట్టకు."

"నువ్వు నమ్మకపోతే నేనేమిటి చెయ్యడం ?"

"నిన్ను ఎప్పుడునమ్మాలో తెలియదు, ఎప్పుడు నమ్మకూడదో తెలియదు. నువ్వునిజంగా మంచివాడవో తెలియదు, చెడ్డవాడవో తెలియదు. నువ్వు మనఃస్ఫూర్తిగా నన్ను ప్రేమిస్తున్నావో తెలియదు, ప్రేమించడంలేదో తెలియదు. ఏమిటి నాబ్రతుకు ?... దేవుడినైనా తెలుసుకోవచ్చునేమో కాని, నిన్ను తెలుసుకోడం అసాధ్యం ...... పోనీ, ఒక్కప్రశ్న వేస్తాను. దానికైనా సరియైన జవాబు చెప్పు— నన్నింకా నువ్వు నిజంగా ప్రేమిస్తున్నావా లేదా?"

"ప్రేమించకేమి?"

"అంతేకాదు. అందరికంటే, అన్నిటికంటే, నీకు నేను ముఖ్యమూ కాదా?"

"కాదు."

"ఎంతవెంటనేచెప్పేవు జవాబు!"

"నిజంచెప్పమన్నావు కాదూ?"

"శాంభవి నీకు ఎక్కవముఖ్యం అన్నమాట ?"

"ఎప్పటికీ కాదు. నువ్వే ముఖ్యంకానప్పుడు..."

"మరి ఎవరునీకు ముఖ్యం ?"

"'ఏమిటి నీకుముఖ్యం?' అని అడుగు."

"పోనీ, ఏమిటి నీకుముఖ్యం ?"

"నేనేచెప్పలేను రాధా. నాకు ముఖ్యమైనది ఏదైనప్పటికీ, అదిమట్టుకు నాజీవితంలోకి ఇంకారా

లేదు. ఈపల్లెలో నాజీవితంతో నాకు అసంతృప్తి రోజురోజుకీ హెచ్చిపోతోంది. ఒక్కొక్క సమయంలో.........కాని, ఎందు కిలానన్ను మాట్లాడించడం, తర్వాత ఉపన్యాసాలిస్తానని విసుక్కోడం?"

"విసుక్కోడం లేదు. చెప్పు.........ఏమిటి నీ అసంతృప్తి?"

"అంతా అసంతృప్తే. ఈపల్లెలో చెయ్యదగినపని ఏదీకనబడదు. ఒకవేళ బుద్ధిలేక ఏదైనాకార్యం తలపెట్తే సాధించడానికి తోడ్పడేవాళ్లు ఎవరూ కనబడరు. అందరూ వేళాకోళం చేసేవాళ్లే. ఏవిషయాలలోనూ తెలివితేటలు లేవు సరిగదా, ఏ విషయాలతోను అభిలాషలుకూడా లేవు. ముసలివాళ్లు వాళ్ల అనుభవజ్ఞానం వాళ్ల నెరిసినవెంట్రుకలు చూసుకుంటూ వాళ్లల్లో వాళ్లే ఆనందించుకోడంతో కాలంగడచిపోతుంది. పడుచువాళ్లకి పౌర్ణమిరాత్రుళ్లూ పొదరిళ్లూ, లేకపోతే అమావాస్యరాత్రుళ్లూ అడవిబయళ్లూ ఉంటే మరేమీ అక్కరలేదు. ఆడవాళ్లకి పిల్లల్ని కనడంతోటే, మొగవాళ్లకి పొలాలుదున్నడంతోటే, మొగపిల్లలకి గొడ్లని మేపడంతోటే, ఆడపిల్లలకి సింగారించుకోడంతోటే జీవితంజరిగిపోతోంది."

"వీళ్లందరూ మరిఏమిటి చెయ్యాలంటావు?"

"ఈ మానవజన్మము యొక్క అర్థంఏమిటి? పుట్టుకఏమి? చావుఏమిటి? ఈసంబంధాలు, ఈచుట్టరికాలు ఈస్నేహాలు— వీటన్నిటియొక్క ఫలితమూ ఏమిటి? ఎందుకు పుట్టేము? ఎందుకు దుఃఖపడతాము?.........ఇటువంటిప్రశ్నలు ఎవరినీ బాధించవు."

"అవి నిన్నుమట్టుకు ఎందుకు బాధించాలి?"

"ఎందుకంటే, నేను అడవిమృగాలతో సమానుడిని కానుకనుక కడుపునింపడం తడవుగా కులాసాగా పడుకోలేను కనుక.........నీకు బోధపడకపోవచ్చును, రాధా. కాని 'జీవితంయొక్క అర్థంఏమిటి?' అన్న ఆలోచన ప్రతినిముషం నన్నుబాధిస్తుంది. ఏక్షణం మరచిపోలేను. కాలిపోతున్న శవాన్ని చూస్తున్నప్పుడూ అదే ఆలోచన; గొప్పదుఃఖంలో ఏడుస్తున్నవాళ్లని చూసినా అదే ఆలోచన; అతిసంతోషంగా నవ్వుతున్నవాళ్లని చూసినా అదే ఆలోచన.........ఎందుకలా నవ్వుతావు?"

"నీ ఉపన్యాసపు ధోరణి చూసి."

"నేనిలా మాట్లాడడం నీకు నచ్చదుకాదూ?"

"నచ్చదని కాదు.........ఒక్కొక్కసారి ఆలోచిస్తే, నిన్ను ఏకోశాన్నీ నేను బోధపరచుకోలేననిపిస్తుంది నాకు."

"అది నిజం."

"నువ్వు ఎల్లప్పుడూ ఇలా ఏళ్లునిండిన పండితుడిలాగ పెద్దపెద్దవిషయాలు మాట్లాడుతూ ఉన్నా బోధపరచుకోగలను. ఎల్లప్పుడూ నవ్వుతూ హాస్యపుకబుర్లుచెప్తూ పల్లెలోఉన్న ఆడపిల్లలనందరినీ హింసిస్తూ వాళ్లవెంట తిరిగినా బోధపరుచుకోగలను. కాని నీకు అనేకరూపాలు. ఆరూపాలలో అనేకభేదాలు. అందులో ఏరూపం నీస్వచ్ఛమైన రూపం అని నమ్మడం?.........ఈపల్లెలో చెయ్యగలిగిన పనిలేక నీకేమీ తోచడం లేదంటావు. నువ్వు రోజూచేసే అల్లరిచేష్టలు ఇన్నీఅన్నీ కావని నీకుతెలుసును. తెల్లవారినదిమొదలు ఏదోఒక పెంకిపని చేస్తూ ఉంటేకాని నీకుతోచదు. పైగా జీవితంలో సంతృప్తిలేదంటావు. ఎప్పుడువస్తుంది నీ కాసంతృప్తి? వెన్నముద్దలు దొంగిలించినా రాలేదు. పరులభార్యలని దొంగిలించినా రాలేదు."

"పరులభార్యలని దొంగిలించానని ఆడవాళ్ల మాటలు కాని, మొగవాళ్ల కెవరికీ అనుమానాలు లేవు. నేనెంత మంచివాడనో వాళ్లకి తెలుసును."

"నీచమత్కారం ఏమిటంటే, ఆడవాళ్లని ఎంత సులభంగా మోసపుచ్చుతావో మొగవాళ్లనికూడా అంతచులాగ్గానూ బుట్టలో వేసుకుంటావు.'

"నావల్ల మోసపోయిన ఆడవాళ్లెవరో చెప్పు చూద్దాం."

"నేను లేనూ?.........ఈమాటలకేమి కాని, ఎందుకు ఉండిఉండి జీవితంలో నీకు సంతృప్తి లేదం

టూఉంటావు. నిన్ను నమ్మేందుకు లేదు కాని, నమ్మి నప్పుడుమట్టుకు చాలాసార్లు అటువంటిసమయాలలో జాలివేస్తుంది. ఎందుకు నీకింత అసంతృప్తి? నిజంగా చెప్పు."

"ఈపల్లెలో ఈ ప్రయోజనంలేని బ్రతుకు నాకు సరిపడదు రాధా."

"ఏమిటి కావాలంటావు?"

"ఏరిపాలించేందుకు రాజ్యాలు, పన్నేందుకు కుట్రలు, పోట్లాడేందుకు యుద్ధాలు, పోషించేందుకు ప్రజలువాదించేందుకు పండిత సమూహాలు, స్థాపించేందుకు క్రొత్తవేదాంతపద్ధతులు—ఏమైనాసరే, ఈపశుప్రాయ జీవితం తప్ప."

"మేమందరం పశుప్రాయులం కాదూ?"

"మీరందరూ అని కాదు. మనం అందరం."

"అయితే ఏమిటి చేద్దామని నీ అభిప్రాయం?"

"ఎప్పుడో ఒకనాడు మళ్లీకనబడకుండా మాయమైపోతాను."

"నిజంగా అటువంటిపని ఏదో చేస్తావనే నా అనుమానం.........నేను ఏమాత్రమూ నీకు అక్కర లేదుకాదూ?"

"నువ్వు నావెంటే వస్తావు, రాధా. నాతోనే ఉంటావు.......అన్నట్టు ఈవాళ నన్ను ప్రత్యేకంగా ఎందుకో రమ్మన్నావు కాదూ? ఎందుకు?"

"అవునుసుమా. నేనుకూడా మరచిపోయాను, చూడు!........నిన్న రమ్మని చెప్పినప్పుడు కారణం ఏమిటో తెలుసునన్నావు కాదూ?"

"తెలుసునులే. అయినా నువ్వుచెప్పు."

"నువ్వు ఏమిటనుకుంటున్నావో చెప్పు."

"వినయుడి పెళ్లి విషయమేనా?"

"అంటే?"

"మీ అమ్మ వినయుడికి నిన్నిచ్చి పెళ్లి చేద్దామనుకోడమేనా?"

"నీ కెలా తెలిసింది?"

"నాకు తెలియని దేముంటుంది?"

"ఎలా తెలిసింది?......... తెలిసినప్పటికీ ఇంత నిర్భయంగానూ, ఇంతనిర్విచారంగానూ ఎలా ఉండగ లుగుతున్నావు?"

"భయమూ విచారమూ దేనికి?"

"దేనికా? ఏది ఎలాజరిగినా నీకు బెంగలేదు. రెండురోజులబట్టి నేను సరిగ్గా తిండితినడంలేదు; సరిగ్గా నిద్రపోవడం లేదు. మాఅమ్మ ఈవిషయంలో చాలా పంతంపట్టింది, తెలుసునా?.........ఇదంతా ఎలా తెలిసింది? ఎవరుచెప్పేరు నీకు?"

"వినయుడే చెప్పేడు."

"వినయుడే? ఏమనిచెప్పేడు?"

"రెండుమూడు వారాలలో నిన్ను పెళ్లిచేసుకుంటున్నానని."

"నువ్వు ఏమన్నావు?"

"విని నవ్వి ఊరుకున్నాను."

"నవ్వడం దేనికి?"

"పెళ్లికబురువిని ఏడవమంటావా? అందులో, అవబోయే పెళ్లికొడుకుముందర?"

"నీకు ఎప్పుడు వేళాకోళంగా మాట్లాడాలో తెలియదు.........వినయుడుచెప్పినదంతా నిజం. మా అమ్మ నన్ను సకలబాధలూ పెట్తోంది. నన్నేమిటి చెయ్యమంటావు?"

"నీకు వినయుడిని పెళ్లిచేసుకోవాలని లేదా?"

"ఇంకా అడుగుతున్నావుకాదూ నన్ను?"

"అడగకపోతే నాకెలా తెలుస్తుంది?......నీ కతను నచ్చలేదన్నమాట!......వినయుడు భర్తగాదొరికితే చాలునన్నవాళ్లు చాలామందున్నారు ఈపల్లెలో."

"చిత్రం! ఆపిల్లకూడా ఆమాటే అంది.........అచ్చు అదేమాట."

"ఏపిల్ల?"

"శాంభవి."

"ఎప్పుడు?"

"ఇందాకా నాతో మాట్లాడుతూ."

"అయితే శాంభవిసలహా కూడా తీసుకున్నావన్న మాట?"

"నాకు నీశాంభవినీ, గింభవినీ సలహాలడిగే అలవాటు లేదు."

"కాని శాంభవి చాలా తెలివైనపిల్ల."

"ఆవిషయం నేనూ కనిపెట్టేను."

"ఏమిటి చెయ్యదలచుకున్నావు నువ్వు?"

"ఏదో ఒకటిచేస్తాను. యమునలోపడి చస్తాను."

"అంతా బాగానే ఉంది కాని ఇంతట్లోనే పెళ్లి జరిగిపోయినట్టు కాదుకా?......ఇప్పుడు వినయుడికి నిన్ను పెళ్లి చేసుకోవాలని లేదనుకో."

"ఏమీ?"

"అనేక కారణా లుండొచ్చును."

"వినయుడికి నన్ను పెళ్లి చేసుకోవాలని లేకపోతే బాగానే ఉండును."

"చేసుకోవాలని లేదనే చెప్పేడునాతో ఈవాళ."

"వినయుడే?"

"వినయుడే.......అతనలా అన్నాడని నువ్వు బెంగపెట్టుకున్నట్టు కనిపిస్తుందేమి?"

"నాకెందుకు వధ్యాని బెంగ? పోనీ, నేను కాకపోతే వినయుడికి ఇన్నాళ్లకి ఎవరునచ్చారు?"

"శాంభవి అంటే అతనికి చాలా ఇష్టంఅని నా అనుమానం."

"వినయుడు నన్ను పెళ్లిచేసుకోవాలని ఆదుర్దా పడుతున్నాడుకనుకనే మా అమ్మ వాళ్లందరినీ పెళ్లిమాటలకి పిలిపించింది.. ......నాదగ్గర ఈవాళకూడా తనకి నేనంతినచ్చినట్టు ప్రవర్తించలేదే వినయుడు!"

"మొగవాళ్లు మాయస్వరూపులు ....అది కాక ఈవాళ అతను నిన్ను కలసుకోడం నన్ను కలసుకోక ముందు."

"అంటే?"

"నన్ను కలసుకున్నాక మనిషితత్వం కొంచెం మారింది."

"అంటే?"

"నాతో మాట్లాడేక నిన్ను పెళ్లి చేసుకోవాలని అంత తహతహలాడటం లేదు మనిషి."

"ఏమీ?"

"నీమాట తనుతలపెట్టేందుకు వీలులేదని చెప్పేనేను. వెంటనేవెళ్లి మీ అమ్మతో తనకి నిన్ను పెళ్లి చేసుకోవాలని లేదని చెప్పమన్నాను."

"నిజంగా?......ఏమన్నాడు?"

"తను శాంభవిని పెళ్లి చేసుకునేందుకు, పోనీ, నాకేమైనా అభ్యంతరం ఉందా అని అడిగేడు."

"శాంభవి విషయంలో నిన్నెందుకు అడగాలి? నీకున్న హక్కేమిటి?"

"ఏదో మాటవరసకి అడిగేడు. నాకేమీ అభ్యంతరం లేదన్నాను."

"ఆమాత్రానికైనా నేనుసంతోషించాలి...... ఎప్పుడు జరిగింది మీఇద్దరికీ ఈసంభాషణంతా?"

"ఈవాళ ప్రొద్దున్న......అంటే......ఈవాళ... ఇప్పుడే......ఈసాయంత్రం ఆమ్రిచెట్టుక్రింద."

"మళ్లీ వచ్చిందీ ఆపాడుమ్రిచెట్టు?......అయితే శాంభవి ఒప్పుకుంటుందీ?"

"శాంభవి ఒప్పుకునేటట్టు చేసేను, ఒకవారం రోజులు ప్రయత్నించి ప్రయత్నించి......"

"ఏమిటి చేసేవు?"

"మంచిచెడ్డలు బోధపరచాను."

"రెండురోజులబట్టి అనవసరంగా బెంగపెట్టుకున్నానన్నమాట?"

"ఈమాత్రానికే?"

"నీ కలా కనిపిస్తోందిమరి. పోనీ నాతో వచ్చి ముందే చెప్పకూడదూ?"

"ఏమిటి చెప్పడం? అసలు నువ్వు బెంగ పెట్టుకు న్నావనీ, అది ఈ కారణంవల్లననీ నాకువచ్చి నువ్వుచెప్తే కద!"

"ఆమాత్రం ఊహించుకోలేవు కాబోలు...... అయినా, అంతా అయిపోయిందికా. ఇప్పుడెందుకు నీలో తప్పులుపట్టడం?"

"నాలో తప్పులుపట్టడమా?.........అంతేకాని కృతజ్ఞత ఏమాత్రమూ లేదు."

"కృతజ్ఞత దేనికి?"

"వినయుడు నిన్ను పెళ్లి చేసుకోకుండా నిన్ను రక్షించినందుకు."

"అంతా నాకోసమే చేసినట్టు!"

"లేకపోతే?"

"నీకోసమే చేసుకున్నావు......పోనీ, కృత జ్ఞతచూపిస్తే ఎలాచూపించమంటావో చెప్పు."

"నన్ను ముద్దుపెట్టుకో."

"నాకొద్దు."

"అయితే, పో."

"ఒక్కటే ఒకటి..."

"ఒక్కటే ఒకటైతే నాకక్కరలేదు."

"ఏమిగర్వం నీకు! అంతా నీఇష్టంవచ్చినట్టే జరగాలి కాదూ?"

"అవును."

"అన్నివిషయాలలోనూ నీఇష్టంవచ్చినట్టే జర గాలి."

"అవును."

"మిగిలినవాళ్లు ఇష్టపడినా సరే, ఇష్టపడకపో యినా సరే?"

"అవును."

"సరే, నీ ఇష్టం."